బడి చూపుదాం.. భవితను వెలిగిద్దాం

● జోరుగా బడిబాట
● వాడవాడల్లో అవగాహన ర్యాలీలు

చంపాపేట: సర్కారు బడుల బలోపేతంలో భాగంగా విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) పెంచేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చంపాపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కాలనీల బాట పట్టారు. ఈ నెల 19 వరకు బడిబాటపై ఉపాధ్యాయులు విద్యార్థులతో అవగాహన ర్యాలీలు, నోట్, పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంల పంపిణీ వంటి పలు కార్యక్రమాలు చేపడుతూ నూతన విద్యార్థుల చేరికలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

‘ప్రైవేట్’కు ఆకర్షితులు కాకుండా..

◆ మురికి వాడల్లోని పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నాణ్యతతో కూడిన విద్యతో పాటు స్కూల్ యూనిఫామ్, నోట్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, సాయంత్రం వేళల్లో అల్పాహారం వంటి సదుపాయాలు కల్పిస్తున్నా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను భారీ హోర్డింగ్‌లు, అందమైన బ్రోచర్లతో ప్రచార ఆర్భాటాలు చేసే ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. దీంతో చంపాపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ఏటేట పడిపోతుండగా ప్రైవేట్ పాఠశాలల్లో చేరికలు మాత్రం మూడు పువ్వులు ఆరుకాయల్లా వర్ధిల్లుతున్నాయి.


బడిబాట అవగాహన ర్యాలీలో పాల్గొన్న కర్మన్‌ఘాట్ హైస్కూల్ విద్యార్థులు

ఇంటింటికి వెళ్లి..

◆ చంపాపేట డివిజన్ పరిధిలలోని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల మౌలిక సదుపాయాలు ఉన్న అయిదు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2610 మంది, రెండు ఉన్నత పాఠశాలలో 1470 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల చేరికలను పెంచే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను బతికించుకునేందుకు ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీలు, మహిళా సంఘాలతో సమావేశాలు, జన సమర్థమైన ప్రాంతాలు, వారాంతపు కూరగాయాల మార్కెట్‌లలో ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా అనుభవం శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే మేలైన బోధనా, పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు వంటి సదుపాయాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మెరుగైన విద్యాబోధన..



ప్రభుత్వ పాఠశాలల్లోనే సుశిక్షితులైన ఉపాధ్యాయులచే మెరుగైన విద్యాబోధన సాగుతుంది. విద్యార్థులందరికీ పౌష్టికాహారం, పరీక్షల సమయంలో దాతల సహకారంతో సాయంత్రం అల్పాహారం, స్కూల్ యూనిఫాంలు, నోట్, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నాం. విద్యలో వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందిద్దాం.. ప్రభుత్వ బడులను బతికిద్దాం అనే నినాదంతో ముందుకు సాగుతున్నాం.

– ఎం.పద్మ, కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం

బడిబాటకు స్పందన..



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేదు. అర్హత కలిగిన ఉపాధ్యాయులచే బోధన ఉంటుంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన, మౌలిక సదుపాయిలు, విశాలమై క్రీడా మైదానం వంటి సౌకర్యాలు ఉన్నాయి. బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. విద్యార్థుల ప్రవేశాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి.

– గణేష్, కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.23, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.18, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.33, మునగ రూ.40, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.31, కీర రూ.35, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.55. ఈ ధరలు సోమవారం ఉదయం 9గంటల వరకు వర్తిస్తాయి.

నియామకం


తరాల్‌శర్మ

నాగోలు: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) నాగోలు డివిజన్ జనరల్ సెక్రటరీగా నారాయణం తరాల్ శర్మను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతే ఈ దేశ భవిష్యత్ అని, యువతకు స్ఫూర్తినిచ్చే విధంగా, వారిని రాష్ట్రీయ అభివృద్ధిలో భాగస్వాములుగా మార్చే దిశగా పని చేస్తానన్నారు. బీజేవైఎం వేదికగా యువతలో దేశభక్తి, సనాతన ధర్మ భావాలను బలోపేతం చేస్తానన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


చెక్కును అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. బీఎస్‌రెడ్డినగర్ సాయిరామ్‌నగర్‌కు చెందిన హన్సశ్రీకి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.3.50 లక్షల చెక్కును ఆదివారం ఆయన అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొగ్గారపు వరణ్, డాక్టర్ రాజయ్యగుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి


మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: డ్రైనేజీ లైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. ఆదివారం కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లో డ్రైనేజీ సమస్యను ఆయన పరిశీలించారు. డ్రైనేజీ నిండి మురుగంతా రోడ్డుపైకి వస్తోందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే డ్రైనేజీ లైన్లను శుభ్రం చేసి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జలమండలి అధికారులకు సూచించారు.

ఉల్లి, మిర్చి బస్తాలను షెడ్‌లోనే డంప్ చేయాలి


నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మార్కెట్‌కు ధాన్యం తీసుకు వచ్చే రైతులకు సూచనలు జారీ చేశామని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మార్కెట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌కు వచ్చే రైతులు ఉల్లి, మిర్చి బస్తాలను షెడ్డులలోనే డంప్ చేయాలని సూచించారు. అదేవిధంగా వ్యాపారులకు కూడా సూచనలు జారీ చేశామన్నారు. బస్తాలు వర్షానికి తడిసే పరిస్థితి ఉంటే మార్కెట్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరలో వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సూర్‌వైజర్ పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

హస్తినాపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా


కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: హస్తినాపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ సహకారంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో వరదనీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి పరిష్కరించనున్నట్లు సుజాతనాయక్ వెల్లడించారు. ప్రజల సహకారంతో డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

‘ఒకే దేశం-ఒకే ఎన్నిక’కు మద్దతు ఇవ్వాలి


వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న లింగాల హరిగౌడ్, ప్రవీణ్

సైదాబాద్: దేశ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఒకేదేశం-ఒకే ఎన్నిక విధానానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా కన్వీనర్ అడ్వకేట్ ప్రవీణ్ కోరారు. ఆదివారం ఉదయం మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించి వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో లోక్‌సభ ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడమే ఈ విధానమన్నారు. వేర్వేరు సమయాలు, ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఎన్నికల ఖర్చు ఎక్కువ అవుతుందని, జమిలి ఎన్నికలుగా పిలవబడే వన నేషన్-వన్ ఎలక్షన్ విధానంతో కేంద్ర ప్రభుత్వంపై ఎన్నికల ఖర్చు తగ్గుతుందన్నారు. దేశ పురగతికి ఉపయోగపడే ఈ విధానానికి అందరూ మద్దతు తెలుపాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

వనస్థలిపురం: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సంస్థల ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం ఆదివారం వనస్థలిపురం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన సంస్థల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్, నక్క శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్, కైఫ్, సురేందర్, వలీ, సందీప్, సైదులు, స్వదేశీ భూషణ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

దేవాలయ పాలక మండలిలో బీసీలను నియమించాలి


మంత్రి కొండా సురేఖకు వినతపత్రం ఇస్తున్న రాజేశ్వర్‌యాదవ్

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవాలయ పాలక మండలిలో 42 శాతం బీసీలను నియమించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం కుర్మగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు రాజకీయ, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కలిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాటకు కట్టుబడి ఉండాలన్నారు. బీసీలకు కూడా నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో రఘునాథ్, భాగ్యలక్ష్మీ, నవీన్ ఉన్నారు.

6కే రన్‌కు స్పందన


రన్‌లో పాల్గొన్న ప్రముఖులు

ఎల్‌బీనగర్: మహవీర్ హరణి వనస్థలి జాతీయ పార్కు (డీర్‌పార్కు) మన్సూరాబాద్ గేట్ వద్ద మహవీర్ హరణి వనస్థలి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌ను బలపరుస్తూ ఆదివారం నిర్వహించిన 6కే రన్‌కువిశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ నేత చింతల సురేందర్‌యాదవ్, నల్లగొండ గద్దర్ హాజరై రన్‌లో పాల్గొన్న సభ్యులకు మెడల్స్ అందజేశారు.అనంతరం అపోలో హాస్పిటల్ సహకారంతో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విక్రంరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణ, జగదీష్‌యాదవ్, జగన్మోహన్‌రెడ్డి, విశ్వనాథ్, రాంరెడ్డి, బీట్ ఆఫీసర్ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ‘గ్రామబాట’


జెండా ఆవిష్కరణలో కటకం నర్సింగ్‌రావు

నాగోలు: బీసీ కులాల్లో చైతన్యం తీసుకురావడానికి మన ఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర వ్యాప్తంగా గ్రామబాట నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు అన్నారు. మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ వ్యాప్తంగా 37నియోజకవర్గాలలోని, 135 గ్రామాల్లో జెండా ఆవిష్కరణ వేడుకలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఆదివారం నాగోలు ప్రాంతంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కటకం నర్సింగ్‌రావు పాల్గొని మాట్లాడారు. బీసీ కులాల్లో చైతన్యం, సఖ్యత, కోసం గత నెల రోజులుగా గ్రామబాట కార్యక్రమాన్ని చేపడుతూ గ్రామాల్లో ఉన్న బీసీలను (కులవృత్తులు చేసుకునే కులాలను) వారి మధ్య సఖ్యతను రాజకీయ చైతన్యాన్ని నింపుతూ గ్రామబాట కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్, దొంత ఆనందం నేత, పూస నరసింహ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ డీఈ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..

◆ ఆటో మీటర్ సీల్ ఆఫీస్, సింగరేణి పార్క్, ఆదర్శ్‌నగర్ నాలా, సరస్వతీ శిశుమందిర్, సరూర్‌నగర్ చెరువు కట్ట, నూర్ కేఫ్ హోటల్, సుల్తాన్‌పురా, గ్రాండ్ హోటల్, కాలికబర్, మెస్కో హాస్పిటల్, పర్వీన్ కేఫ్, అబిద్‌అలీ, ఇమ్లిబన్ బస్టాప్, తీగలగూడ, అఫ్జల్ నగర్, బంజారా నగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్‌టీఓ ఆఫీస్, బాలాజీ అపార్ట్‌మెంట్స్, వహీద్‌కాలనీ, అర్బాద్ గ్రౌండ్, ఇస్లామియా కాలేజ్, సయ్యద్ గౌస్ పీటీ, ఖాలేద్ సౌండ్, సూర్యజంగ్ దేవడి, ఎస్‌ఆర్‌టీ కాలనీ, గాంధీ కా పుత్లా, మార్నింగ్ స్టార్, కమ్యూనిటీ హాల్, టెంపుల్ పీటీ, అజ్మత్‌నగర నాలా పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు..

◆ శంకేశ్వరబజార్, గ్రీన్ అపార్ట్‌మెంట్స్, సింగరేణి కాలనీ పెట్రోల్ పంప్, పీ అండ్ టీ కాలనీ కల్లు కంపౌండ్, ఆది హోండా వర్క్‌షాప్, సాయిరాం మోటార్స్, ఈస్ట్ ప్రశాంత్‌నగర్, గోదా రెడ్డి పీటీ, ఆజాద్ పార్క్, గంగం బౌలి, అజారియా మజీద్, ఇండియా ఫంక్షన్ హాల్, పర్‌ఫెక్ట్ స్కూల్, పూలతోట, పీఎస్ పీటీ, భూలక్ష్మీ టెంపుల్, డబీర్‌పురా మెయిన్‌రోడ్, యాసీన్ జంగ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మలక్‌పేట: కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు అన్నారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ద డిసేబుల్డ్ (ఫెడ్) ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ సహకారంతో అక్బర్ బాగ్ లూయిస్ బ్రెయిలీ పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. జస్టిస్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడానికి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సీహెచ్ పంచాక్షరి, జిల్లా న్యాయ సేవా కార్యదర్శి కిరణ్మయి, న్యాయసేవ పరిపాలన అధికారి రాజు, ట్రైన్డ్ మీడియేటర్ అబ్దుల్ లతీఫ్ అహ్మద్, ఫెడ్ చైర్మన్ గంగారామ్, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం,ఆసిఫ్, రాకేష్, సురేష్, గంగాధర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన నారసింహ హోమం

ఎల్‌బీనగర్: శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సేవా సదనంలో ఆదివారం శ్రీసుదర్శన నారసింహ హోమం ఘనంగా నిర్వహించారు. దేవనాథ్ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవనాథ్ రామానుజ జీయర్‌స్వామి ప్రసగిస్తూ.. శ్రీవైష్ణవ బంధువులందరూ శ్రీవైష్ణవ సమాజ అభివృద్ధికి పాటు పాడాలని, ఎస్వీఎస్ ట్రస్టులో సమూల మార్పులు చేసి నూతన సభ్యులను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏవీఎల్‌ఎస్ చారి, ప్రధాన కార్యదర్శి కందాల కృష్ణమాచారి, కోశాధికారి కండ్లకుంట వెంకటరమ్ ప్రజాద్, ప్రముఖ గాయకుడు కొమాండూరి రామాచారి పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని భూ సమస్యలు పరిష్కరించడం కోసం గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 118ను తీసుకొచ్చిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ స్వలాభం కోసం మధుయాష్కీగౌడ్ జీవో అమలు కాకుండా నిలిపివేశారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లతో చర్చించి 118జీఓను తీసుకొచ్చామని తెలిపారు. కేవలం గజానికి రూ.250 మాత్రమే తీసుకుని కన్వీనియన్స్ డీడ్‌లు అందజేశామని ఎన్నికల కోడ్ రావడంతో దరఖాస్తు చేసుకున్న వారిలో 25 శాతం మందికి మాత్రమే కన్వీనియన్స్ డీడ్‌లు అందజేశామన్నారు. కన్వీనియన్స్ డీడ్‌లు పొందిన వారికి 2008 కన్నా ముందు అనుమతులు ఉన్న వారికి రిజిస్టేషన్లు అవుతున్నాయ లేదో పరిశీలించుకోవాలని అన్నారు. రిజిస్ట్రేషన్లు జరుగుతున్నప్పుడు జీవో బోగస్ ఎలా అవుతుందని దీనిపై మధుయాష్కీగౌడ్ చర్చకు రావాలన్నారు. ఈ సమావేశంలో సుధాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ధన్‌రాజ్, పోగుల రాంబాబు, ముత్యంరావు, రవీంధర్‌రెడ్డి, మహేంధర్‌రెడ్డి, సోమిరెడ్డి, నాయకులు అనిల్‌చౌదరి, మాధవరం నరసింహరావు, సుమన్‌గౌడ్, సుధాకర్‌యాదవ్, సతీష్‌గౌడ్, శ్రీనివాస్ శశిధర్‌రెడ్డి, రాఘవేంధర్ రావు, భిక్షపతి పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం


యూజీడీ పనులను ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

ఎల్‌బీనగర్: ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించి, డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి పవనగిరి కాలనీఫేజ్-2లో రూ.36 లక్షలు, ఫేజ్-1లో రూ.13లక్షలు, ఆదిత్యానగర్‌కాలనీలో రూ.23 లక్షలతో సీసీ రోడ్డు పనులు, రాజరాజేశ్వరీకాలనీలో రూ.3 లక్షలతో యూజీడీ పనులను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. శివారు ప్రాంతాల్లో కాలనీలు నూతనంగా ఏర్పాటు అవుతున్నాయని, ఎన్నికల హామీల మేరకు ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణగౌడ్, మురళీధర్‌రెడ్డి, సాయిలుగౌడ్, నర్సింహ్మా, వేణుగోపాల్, జాన్, కుమారాస్వామి, రమణారెడ్డి, వెంకటేష్, రాంగోపాల్, సందీప్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించకుంటే ధర్నాచేస్తాం

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సహాయ పరికరాల దరఖాస్తుల గడువును జూన్ 30వ తేదీ వరకు పొడిగించాలని ఎన్‌ఆర్‌డీపీ (నేషనల్ ప్లాట్‌ఫాం ఫర్ ది రైట్స్ ఆఫ్ ది డిసెబుల్) రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం మలక్‌పేటలోని సంక్షేమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. టెండర్స్ వేసిన పరికరాలన్నింటిని లబ్ధిదారులకు పంపిణి చేయాలన్నారు. మోటరైస్డు వెహికల్స్ 2000లకు టెండర్స్ వేశారని, ఆన్‌లైన్‌లో 1800 వాహనాలు మాత్రమే చూపెడుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలంటే 15 రోజుల సమయం పడుతుందని అన్నారు. చదువుతో సంబంధం లేకుండా 40 శాతం వైకల్యం ఉన్న వాళ్లందరికి మోటరైస్డు వాహనాలు మంజూరు చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు వైకల్య శాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటామనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దరఖాస్తు కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్తే అఫిడవిట్‌తో పాటు తహసీల్దార్ నుంచి అన్ ఎంప్లాయి సర్టిఫికెట్ తీసుకొని దరఖాస్తు చేయాలని నిబంధన పెట్టడం ఏంటని ప్రశ్నించారు. దరఖాస్తు గడువు పొడిగించకుంటే జూన్ 17న వికలాంగుల సంక్షేమ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.ఆదివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ



నాగోలు: భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీలో నాగోలు మోహన్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన (కైనెటిక్ గ్రీన్,రివోల్ట్, కోమాకి) ఎలక్ట్రిక్ వాహనాల షోరూమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాబోయే రోజుల్లో ప్రజలు బ్యాటరీ వాహనాలకు ఆదరణ ఉంటుందన్నారు. వాతవరణ కాలుష్యాన్ని తగ్గించడంలో ఎలక్ట్రిక్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు అనంతుల రాజిరెడ్డి, కైనెటిక్ గ్రీన్ ఎండీ అనంతుల భారత్ భూషన్‌రెడ్డి, రివోల్ట్ ఎండీ దుర్గా రెడ్డి, కోమాకి ఎండీ హరిష్‌కుమార్ రెడ్డి కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, చింతల సురేందర్ యాదవ్, నాయకులు విఠల్ రెడ్డి, సాగర్ రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సంగీత ప్రశాంత్ గౌడ్, చిరంజీవి, అనంతుల సురేందర్‌రెడ్డి, పి. రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ ఆజాద్, బద్ధం నరేందర్‌గౌడ్, గోల్కొండ మైసయ్య, లింగాల రాహుల్ గౌడ్ పాల్గొన్నారు.